ప్రజాశక్తి
ఆదివారం 20 ఏప్రిల్, 2025 5
శ్రీకాకుళం



రేపు ప్రవేశ పరీక్ష

కవిటి: మండలంలోని రాజపురంలో ఉన్న ఆదర్శ పాఠశాలలో 6వ తరగతిలో ప్రవేశాలకు ఈనెల 21న పరీక్ష నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్ ఎం.ఈశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి 12 గంటల వరకూ పరీక్ష నిర్వహిస్తునట్లు తెలిపారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు ఉదయం 8 గంటలకే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని సూచించారు.

పోలాకి: ఈ నెల 21న ఈదులవలస బిసి మోడల్ స్కూల్ ఆరో తరగతి ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ పైడి ప్రవీణ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహిస్తామని అన్నారు. ఆన్‌లైన్‌లో 344 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. పరీక్షకు హాల్‌టిక్కెట్లు ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. పరీక్షకు హాజరుకానున్న విద్యార్థులు ఆధార్, ఏదైనా గుర్తింపు కార్డు, రెండు పాస్‌పోర్ట్‌సైజ్ ఫొటోలు తీసుకుని రెండు గంటల ముందుకు కేంద్రానికి చేసుకోవాలన్నారు.

ఇక స్లాట్ బుకింగ్

- రేపట్నుంచి రిజిస్ట్రేషన్ విధానంలో మార్పు
- సబ్ రిజిస్ట్రార్లకు శిక్షణ పూర్తి
- సిఫార్సులకు అడ్డుకట్ట

జిల్లాలోని అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్ విధానాన్ని ఈ నెల 21నుంచి అమలులోకి తీసుకొచ్చేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇప్పటికే ఈ విధానంపై జిల్లాలోని సబ్ రిజిస్ట్రార్లకు అవగాహన కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహించింది. ఈ నెల నాలుగు నుంచి జిల్లాలో ఒక సబ్ రిజిస్ట్రార్ ఉప కేంద్రంలో పైలట్ ప్రాజెక్టు కింద స్లాట్ బుకింగ్ విధానాన్ని అమలు చేశారు. జిల్లాలోని మిగిలిన 12 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో సోమవారం నుంచి స్లాట్ బుకింగ్ విధానం అమలులోకి రానుంది.

ప్రజాశక్తి - శ్రీకాకుళం

పాస్‌పోర్టు, వివాహాల రిజిస్ట్రేషన్ తరహాలోనే ఇకపై స్లాట్ బుకింగ్ ద్వారా భూముల రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుంది. ఈ కొత్త విధానాన్ని ఈ నెల 21 నుంచి స్టాంప్ అండ్ రిజిస్ట్రేషన్‌శాఖ క్షేత్రస్థాయిలో అమలు చేయనుంది. రిజిస్ట్రేషన్ శాఖలో కూడా స్లాట్ బుకింగ్ విధానం పూర్తిస్థాయిలో అమలు చేస్తున్నారు. గత మూడేళ్లలో రాష్ట్ర స్టాంపులు రిజిస్ట్రేషన్‌శాఖలో అనేక మార్పులు తీసుకొచ్చారు. ఇప్పటికే మాన్యువల్ (చేతితో రాసిన) రిజిస్ట్రేషన్ పద్ధతి నుంచి 2.0 ప్రైమ్ విధానం అమల్లోకి వచ్చింది. దీనిద్వారా పూర్తిగా రిజిస్ట్రేషన్ చేయవలసిన స్థిరాస్తుల వివరాలన్నీ కంప్యూటర్లో అప్‌లోడ్ చేసిన తరువాత ఆ స్థిరాస్తికి సంబంధించిన విలువలతో పాటు ఇతర వివరాలు కూడా స్క్రీనుపై దర్శనమిస్తాయి. గతం కంటే కొంత మెరుగైన విధానంతో రిజిస్ట్రేషన్‌శాఖ కార్యాలయాల్లో ఉద్యోగులు కొంత ఊపిరిపీల్చు కుంటున్నారు. అందరూ ఒకసారి వచ్చే అవకాశం ఉండదు. స్లాట్ ఆధారంగా ఎవరికి ఇచ్చిన సమయాన్ని బట్టి వారు వచ్చి రిజిస్ట్రేషన్ చేయించుకోవచ్చు. దీనికి తోడు రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో పారదర్శకత పెరుగుతుందని ఆశాఖ అధికారులు అంటున్నారు. మాన్యువల్ పద్ధతి కన్నా 2 శాతం ప్రైమ్ విధానం ద్వారా రిజిస్ట్రేషన్‌లో కొంత ఆలస్యం అవుతాయనే భయం కొనుగోలుదారులను వెంటాడుతుంది. ఈ నెల 21 నుంచి స్థిరాస్తి రిజిస్ట్రేషన్లకు ముందుగానే స్లాట్ బుక్ చేసుకుంటే తప్ప రిజిస్ట్రేషన్ సాధ్యం కాదు. ఈ నెల 21 నుంచి జిల్లాలో అన్ని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్ విధానం పూర్తిస్థాయిలో అమలు చేయనున్నారు. ఈ విధానం ద్వారా రిజిస్ట్రేషన్ చేయించుకునే వ్యక్తులు కార్యాలయాల వద్ద రోజులు, గంటల తరబడి పడిగాపులు కాయాల్సిన అవసరం లేదు. కాలయాపన లేకుండా వారికి కేటాయించిన తేదీ, నిర్దేశిత సమయానికి వచ్చి రిజిస్ట్రేషన్ చేసుకుని వెళ్లవచు. సమయంతో పాటు రిజిస్ట్రేషన్‌లో పారదర్శకతను పెంచడానికే ఈ స్లాట్ బుకింగ్ విధానాన్ని తీసుకొచ్చారు.



సిఫార్సులకు స్వస్తి

స్లాట్ బుకింగ్ విధానం వల్ల రిజిస్ట్రేషన్ల పద్ధతిలో మార్పు వస్తుంది. సిఫార్సులు అవసరం లేకుండా స్లాట్ విధానంలో ఇచ్చిన సమయం మేరకు రిజిస్ట్రేషన్లు చేసుకోవచ్చు. ప్రస్తుతం రిజిస్ట్రేషన్లలో 2.0 ప్రైమ్ విధానం అమలవుతుంది. ఈ విధానం ద్వారా రోజూ సుమారుగా 270 నుంచి 300 వరకు రిజిస్ట్రేషన్లు జిల్లా కేంద్రం, ఇతర మండలాల్లో ఉన్న 13 రిజిస్ట్రారు కార్యాలయాల్లో 2.0 ప్రైమ్ విధానం ద్వారా ముందుగానే రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సిన స్థిరాస్థి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలి. ఆ తర్వాత కార్యాలయానికి వెళ్లిన తర్వాత సిబ్బంది పరిశీలిస్తారు. తర్వాత స్కాన్ చేసి రిజిస్ట్రేషన్ శాఖ సర్వర్లో ఫీడ్ చేసేవారు. కానీ, ఈ విదానం అమలు కష్టమని, 2.0 ప్రైమ్ విధానంలో కొన్ని సాంకేతిక లోపాలు ఉండడం వల్ల ఈ విధానం పూర్తిగా అమలుకు సాధ్యం కాలేదని ఆశాఖ అధికారులే చెపుతున్నారు. రిజిస్ట్రేషన్‌శాఖ కార్యాలయంలో రోజువారి నిర్వహించాల్సిన రిజిస్ట్రేషన్లు ఎవరెవరి అవసరాన్ని బట్టి వారు సిఫార్సులు చేస్తే కాస్త ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశాలు ఉన్నాయి. కొత్తగా వస్తున్న స్లాట్ బుకింగ్ విధానం ద్వారా ముందుగానే రిజిస్ట్రేషన్ తేదీని, సమయాన్ని నిర్ణయించుకునే అవకాశం ఉంది. క్రయవిక్రయాలు జరిపే స్థిరాస్తికి సంబంధించిన అన్ని వివరాలు నిషేధిత జాబితాను పరిశీలించుకొని అందుకు సంబంధించిన ఆస్తి విలువను నిర్ధారించుకుని సరిపడినంత చలానా ముందుగానే చెల్లించిన తర్వాత స్లాట్‌లో అన్ని వివరాలు పొందుపరచాల్సి ఉంటుంది. రసీదు పొందిన సమయంలో స్లాట్ ప్రకారం నిర్ధేశించిన సమయానికి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లాల్సి ఉంటుంది. ఈ విధానం సక్రమంగా అమలైతే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రద్దీ తగ్గుతుందని ప్రభుత్వ యోచన.

రిజిస్ట్రేషన్ ముందు రోజే స్లాట్ బుకింగ్

ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు సోమవారం నుంచి జిల్లాలో అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్ విధానంలో రిజిస్ట్రేషన్లు నిర్వహించనున్నట్టు జిల్లా రిజిస్ట్రారు ఎ.నాగలక్ష్మి తెలిపారు. స్లాట్లు రోజూఉదయం 10.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు బుకింగ్ చేసుకునే వీలుందని ఆమె తెలిపారు. జిల్లాలో ప్రజలందరూ రిజిస్ట్రేషన్లకు ఈ స్లాట్ బుకింగ్ విధానాన్ని వినియోగించుకోవాలని సూచించారు. దీనిపై ఎటువంటి సందేహాలు ఉన్నా తమ పరిధిలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని సంప్రదించి పూర్తి వివరాలు తెలుసుకోవాలని ఆమె సూచించారు. ఎనీవేర్ పద్ధతిలో రిజిస్ట్రేషన్లు చేయించుకోవాలనుకున్న వారు ఒక రోజు ముందుగా స్లాట్ బుకింగ్ విధానంలో స్లాట్ బుక్ చేసుకుని రిజిస్ట్రేషన్ పొందవచ్చన్నారు.

మినీ గోవాగా బారువా బీచ్

కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు



జెండా ఊపి ప్రారంభిస్తున్న కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు

ప్రజాశక్తి - సోంపేట

మండలంలోని బారువా బీచ్‌ను అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందే పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తామని కేంద్ర పౌరవిమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తెలిపారు. శనివారం బీచ్ ఫెస్టివల్ సందర్భంగా ఆలివ్ రిడ్లీ తాబేళ్లను సముద్రంలోకి విడిచిపెట్టే ప్రత్యేక కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బారువా బీచ్‌కు ఉన్న స్వచ్ఛమైన పరిసరాలు, మహేంద్ర తనయా కలిసే ప్రదేశం, లైట్‌హౌస్, సముద్రంలో మునిగిన ఓడ, చదునుగా విశాలంగా ఉన్న తీరం వంటి సహజ వనరులతో దీనిని మినీ గోవా తరహాలో అభివృద్ధి చేస్తానని హామీనిచ్చారు. సముద్రపు లోతు, తీరప్రాంతం సరళత పర్యాటక క్రీడలకు అనువుగా ఉన్నాయన్నారు. స్కూబా డైవింగ్, పారా మోటార్ ఫ్లయింగ్, వాటర్ స్పోర్ట్స్ వంటి కార్యక్రమాలకు ఇది గొప్ప కేంద్రంగా మారుతుందని తెలిపారు. తీరప్రాంత సౌందర్యం, మౌలిక సదుపాయాలపై నిపుణులు పరిశోధనలు చేస్తున్నారని అన్నారు. మత్స్యకారులకు తాబేళ్ల పరిరక్షణపై శిక్షణ ఇచ్చి, ప్రకృతి సమతుల్యత కాపాడేవిధంగా వారిని భాగస్వాముల్ని చేస్తున్నామని వివరించారు. ప్రజలు కోరినట్లుగా సముద్రతీర ప్రాంతాన్ని టూరిజం హబ్‌గా మార్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని చెప్పారు. పర్యాటకాభివృద్ధితో పాటు స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు. స్కూబా డైవింగ్, లైఫ్ గార్డ్, గైడ్‌లు, ఈవెంట్ మేనేజ్‌మెంట్ వంటి రంగాల్లో వారికి శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. కార్యక్రమానికి ప్రభుత్వ విప్ బెందాళం అశోక్, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధ్యక్షత వహించి ప్రసంగించారు. కలెక్టర్ మాట్లాడుతూ 50 శాతం ఆలివ్ రిడ్లే పిల్లలే తిరిగి సముద్రంలోకి ప్రవేశిస్తాయని, అందుకే జిల్లాలో 16 కేంద్రాల ద్వారా వాటి సంరక్షణకు అటవీ శాఖ చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు. రెండు లక్షల తాబేళ్ల పిల్లల సంరక్షణ లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. తాబేళ్ల పరిరక్షణలో జిల్లా దేశంలోనే విశిష్ట గుర్తింపు సాధించిందని అటవీశాఖ అధికారులు తెలిపారు. తాబేళ్ల పునరుత్పత్తి కేంద్రంగా శ్రీకాకుళం నిలుస్తుందని వెల్లడించారు. ఈ ప్రక్రియలో మత్స్యకారులకు శిక్షణతో పాటు ప్రోత్సాహకాలు అందిస్తున్నట్టు చెప్పారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రదర్శనల్లో వరిమీ కంపోస్టు, వ్యర్థాలను విద్యుత్‌గా మారుస్తున్న ప్రాజెక్టులు, ఆలివ్ రిడ్లీ తాబేళ్లపై పోస్టర్లు, చిత్రలేఖన పోటీలు ఆకట్టుకున్నాయి. విజేతలుగా సింహాద్రి హాసిని (జెడ్‌పి హెచ్‌ఎస్, బురగం), రెంటికోట విద్యార్థులు ఎంపికయ్యారు. పర్యావరణంపై అవగాహన పెంచేందుకు విద్యార్థులకు 'జీవవైవిధ్యం' అంశంపై డాక్యుమెంటరీ ప్రదర్శనలు, పర్యటనలు కూడా చేపట్టారు. బారువా బీచ్ ప్రత్యేకతను జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో చాటేందుకు ప్రత్యేక వెబ్‌సైట్, ప్రచార కార్యక్రమాలు ప్రారంభించినట్టు కలెక్టర్ తెలిపారు. బారువా పేరును బ్రాండ్‌గా మార్చేదిశగా చర్యలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్‌పి కె.వి.మహేశ్వర్ రెడ్డి, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, రెవెన్యూ అధికారులు వెంకటేష్, ఎం.కృష్ణమూర్తి, అటవీ శాఖ అధికారులు పాల్గొన్నారు.



షీల్డ్‌ను అందజేస్తున్న అందజేస్తున్న నిర్వాహకులు

బీచ్ వాలీబాల్, కబడ్డీ పోటీల్లో బారువా జట్టు విజయం

బారువలో నిర్వహిస్తున్న ఆలివ్ రిడ్లే బీచ్ ఫెస్టివల్ సందడిగా సాగుతోంది. శనివారం నిర్వహించిన క్రీడా పోటీలు ఉత్సాహంగా సాగాయి. వాలీబాల్ పోటీల్లో బారువ జట్టు ప్రథమ స్థానంలో నిలిచింది. గోలగాండి జట్టు ద్వితీయ స్థానాన్ని, కొట్టూరు జట్టు తృతీయ స్థానాన్ని కైవసం చేసుకున్నాయి. ఈ పోటీల్లో మొత్తం పది జట్లు పాల్గొన్నాయి. అలాగే, బీచ్ కబడ్డీ పోటీలూ ఆసక్తికరంగా సాగాయి. బారువ-1 జట్టు మొదటి స్థానాన్ని, బారువ-3 జట్టు రెండో స్థానాన్ని, బారువ-1 జట్టు మూడో స్థానాన్ని గెలుచుకున్నాయి. ఈ పోటీల్లో మొత్తం 8 జట్లు తమ ప్రతిభను చాటాయి. విజేత జట్లకు నిర్వాహకులు అభినందనలు తెలిపారు. ఈ క్రీడా పోటీలు ప్రేక్షకులను ఎంతగానో అలరించాయి.



విక్రమ్ రాజా | రోహిత్ దత్త | హేమసుందర్ | సాయిఅనీష్ | బలవర్ధన్ | జయంత్

జెఇఇలో మెరిసిన విద్యార్థులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి, అరసవల్లి, పలాస

జెఇఇ మెయిన్స్‌లో సిక్కోలు విద్యార్థులు సత్తాచాటారు. జాతీయస్థాయిలో వివిధ కేటగిరిల్లో అత్యుత్త ర్యాంకులు సాధించారు. ఎచ్చెర్ల మండలం అల్లినగరానికి చెందిన బుడుమూరు విక్రమ్ రాజాకు జాతీయ స్థాయిలో 64వ ర్యాంకు సాధించారు. ఒబిసి కేటగిరిలో ఆరో ర్యాంకు దక్కింది. తండ్రి సోమరాజు అల్లినగరం పంచాయతీ చిన్నయ్యపేట లో ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్నారు. తల్లి కళ్యాణి గృహిణి. విశాఖలోని శ్రీ చైతన్య కళాశాలలో ఇంటర్ చదివారు. జెఇఇలో ప్రతిభ చూపిన విద్యార్థి విక్రమ్ రాజా తల్లిదండ్రులను శ్రీకాకుళం శ్రీ చైతన్య విద్యా సంస్థల డీన్ కె మురళీధర్ పుష్పగుచ్ఛం అందించి అభినందించారు.

రోహిత్ దత్తాకు 255వ ర్యాంకు

శ్రీకాకుళం నగరానికి చెందిన బండారు రోహిత్ దత్త 99.987 పర్సంటేజ్ మార్కులు సాధించి జెఇఇ మెయిన్స్‌లో జాతీయ స్థాయిలో ఓపెన్ క్యాటగిరిలో 255వ ర్యాంకు సాధించారు. 9వ తరగతి నుంచి విజయవాడ చైతన్య కళాశాలలో ఈ విద్యాభ్యాసం చేసి పదో తరగతిలో 594, ఇంటర్‌లో 984 మార్కులు సాధించారు.

ఈయన తండ్రి పివిఎస్ సాయిరాం ఉపాధ్యాయుడు కాగా, తల్లి లక్ష్మీప్రసన్న జిల్లా చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్‌గా ప్రణాళిక శాఖ జాయింట్ డైరెక్టర్, జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారిరిగా విధులు నిర్వహిస్తున్నారు. రోహిత్ దత్త ర్యాంకు సాధించడంపై కుటుంబ సభ్యులు, స్నేహితులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

సత్తా చాటిన పలాస విద్యార్థులు

జెఇఇ మెయిన్స్‌లో పలాస విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. మొగిలిపాడుకు నూకల హేమసుందర్ ఓబిసి కేటగిరిలో 965, కుశిరెడ్డి సాయిఅనీష్ 1560, జాతీయ స్థాయి ఓపెన్ క్యాటగిరిలో ఎం.బలవర్ధన్ 6,788, బొంగి జయంత్ 8,267, ర్యాంకులు సాధించారు. బలవర్ధన్, జయంత్‌లకు నారాయణ కళాశాల హెచ్‌ఎం బి.నారాయణ అభినందనలు తెలిపారు.

వైసిపి సభ్యుల వాకౌట్

ప్రజాశక్తి - వజ్రపుకొత్తూరు

అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రోటోకాల్ పాటించకుండా వైసిపికి చెందిన ఎంపిటిసిలు, సర్పంచలను గుర్తించడం సభ్యులు వాపోయారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి ఉప్పరపల్లి నీలవేణి అధ్యక్షతన శనివారం మండల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశం మధ్యలో సభ నుంచి వైసిపికి చెందిన సర్పంచ్‌లు, ఎంపిటిసిలు వాకౌట్ చేశారు. ముందుగా కోరం లేకపోవడంతో సభ కొంత ఆలస్యంగా ప్రారంభమైంది. ముందుగా వ్యసాయం, విద్యుత్, హౌసింగ్ శాఖలకు సంబంధించి అంశాలపై చర్చించారు. అనంతరం మండల ప్రత్యేక ఆహ్వానితులు ఉదయ్‌కుమార్ మాట్లాడుతూ అధికారికి కార్యక్రమాలకు వైసిపికి చెందిన ఎంపిటిసిలకు, సర్పంచ్‌లకు అధికారులు పిలవకుండా ప్రోటోకాల్‌ను ఉల్లంఘిస్తున్నారని అన్నారు. అందుకు నిరసనగా సభ నుంచి వాకౌట్ చేస్తున్నట్లు ప్రకటించారు. దీనికి ఎంపిపి నీలవేణి మద్దతు తెలపడంతో ముకుమ్మడిగా సభ నుంచి వెళ్లిపోయారు. అయితే వైసిపికి చెందిన కో-ఆప్షన్ సభ్యుడు మరడ భాస్కర్‌రెడ్డి వాకౌట్ చేయకుండా సభలోనే ఉండిపోవడం విశేషం. దీనిపై ఎంపిడిఒ ఎన్.రమేష్‌నాయుడు మాట్లాడుతూ మూడు నెలలకు ఒకసారి నిర్వహించే సమావేశంలో సభ్యులు వాకౌట్ చేయడం వల్ల సమస్యలు పరిష్కారం కావన్నారు. సమస్యలు ఏమైనా ఉంటే సభలో సభ్యులు ప్రస్తావిస్తే వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కో-ఆప్షన్ సభ్యులు మాట్లాడుతూ బెండి గేటు ఫ్లై ఓవర్ బ్రిడ్జిపై రాత్రి వేళల్లో విద్యుత్ లైట్లు వెలగకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు పేర్కొన్నారు. అలాగే బెండి గేటు వద్ద ఉన్న హరిజనపేటకు విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో పశు వైద్యాధికారి మెట్ట పాపారావు, ఇఒపిఆర్‌డి తిరుమలరావు పాల్గొన్నారు.



వాకౌట్ చేస్తున్న వైసిపి సభ్యులు



వినతులను స్వీకరిస్తున్న రామ్మోహన్ నాయుడు

ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్

కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు

ప్రజాశక్తి - పలాస

జిల్లాలో ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రతి నియోజకవర్గం కేంద్రంలో ప్రజాదర్బార్ నిర్వహించి అక్కడిక్కడే పరిష్కరించేందుకే చర్యలు తీసుకుంటున్నామని కేంద్ర విమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో శనివారం ప్రజాదర్బార్ నిర్వహించి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పలాస ప్రాంతంలో ఎయిర్ పోర్టు నిర్మాణానికి అనుమతులు వచ్చాయని, స్థల సేకరణ పూర్తయితే నిర్మిస్తామని తెలిపారు. ప్రజలు అభివృద్ధికి సహకారం అందించాలన్నారు. మున్సిపాలిటిలో తన నిధులు రూ.కోటి కేటాయి ంచామని, పనులూ పూర్తయ్యే దశలో ఉన్నాయని తెలిపారు. కాశీబుగ్గ ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి రైల్వేశాఖ నిధులు రూ.48 కోట్లు మంజూరు చేశాంమని అన్నారు. దీనికి చెందిన పనులు త్వరలో ప్రారంభిస్తామన్నారు. తాళభద్ర రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జికి మోక్షం కలుగుతుందన్నారు. జీడి పరిశోధనా కేంద్రం నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామని, స్థలం కోసం అన్వేషిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో నియోజకవర్గ టిడిపి సమన్వయకర్త యార్లగడ్డ వెంకన్నచౌదిరి, ఎపిటిపిసి చైర్మన్ వజ్జ బాబూరావు, బిసిసెల్ ప్రధాన కార్యదర్శి లొడగల కామేశ్వరరావుయాదవ్, పీరుకట్ల విఠల్‌రావు, గురిటి సూర్యనారాయణ, టంకాల రవిశంకర్‌గుప్త, బడ్డ నాగరాజు, సప్ప నవీన్, గాలి కృష్ణారావు, ఎ.రామకృష్ణ పాల్గొన్నారు.

అచ్చెన్నలో నిద్ర లేచిన అభివృద్ధి కాంక్ష



ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడులో ఇన్నాళ్లకు అభివృద్ధి ఆకాంక్ష మేల్కొంది. మూడు దశాబ్దాల రాజకీయ జీవితంలో తొలి సారి జిల్లా వెనుకబాటుపై ఆయన ఆవేదన చెందటం కనిపించింది. బహుశా ముఖ్యమంత్రి చంద్రబాబు మాటలు సుప్తావస్థలో ఉన్న ఆయనను నిద్ర లేపినట్లు ఉన్నాయి. శ్రీకాకుళం నగరంలో ఇటీవల బిసి భవన్ ప్రారంభోత్సవం సందర్భంగా ఆయన చేసిన ప్రసంగం వింటే సిక్కోలుపై ఆయనకు ఇన్నాళ్లకు ప్రేమ కలిగిందా? అని జనంలో చర్చించుకుంటున్నారు. ఆ మధ్య కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో శ్రీకాకుళం జిల్లా వెనుకబడి పోయిందని, 26 జిల్లాల్లో తలసరి ఆదాయంలో జిల్లా అట్టడుగున ఉందని, తామేమి చేస్తున్నామని చంద్రబాబు అడిగితే ఏం చెప్పాలో తెలియక తాను చిన్నబోయానని చెప్పడంతో అక్కడ ఉన్నవారంతా ఒకింత ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఆయనే సుదీర్ఘకాలం ప్రజాప్రతినిధిగా ఉండటంతో చంద్రబాబు మంత్రిని ఉద్దేశించే అని ఉంటారని జనంలో గుసగుసలు వినిపించాయి. జిల్లాకు వెనుకబాటు కారణాలనూ ఆయన తన మనోగతాన్ని వెల్లడించారు. శ్రీకాకుళం అంటే ఉద్యమాలు, అభివృద్ధి కార్యక్రమం చేద్దామంటే అడ్డుపడుతున్నారంటూ తన అసమర్థతను ఉద్యమాలపైకి నెపం నెట్టేశారు. ఇటీవల జెడ్‌పి సర్వసభ్య సమావేశంలోనూ ఇదే రకమైన వ్యాఖ్యలు అమాత్యుల నోటి వెంట వచ్చాయి. సోంపేట, కాకరాపల్లి థర్మల్ విద్యుత్ ప్రాజెక్టుల విషయాన్ని ప్రస్తావించారు. తమకు కమీషన్లు వస్తాయనో లేక ప్రభుత్వ పెద్దలు తమకు కావాల్సిన మనుషుల కోసం ప్రజలకు నష్టం కలిగించే ప్రాజెక్టులను ప్రతిపాదించడం, వాటిని అడ్డుకుంటున్న క్రమంలో అభివృద్ధికి ఆటంకం కలిగిస్తున్నారనో లేక అభివృద్ధి నిరోధకలనో ముద్ర వేయడం పాలకులకు ఫ్యాషనైపోయింది. పర్యావరణాన్ని ప్రజల జీవితాలను నాశనం చేసే సోంపేట, కాకరాపల్లి థర్మల్ విద్యుత్కేంద్రాలను ప్రజలు అడ్డుకున్న సందర్భంలో అప్పట్లో మంత్రిగా ఉన్న ధర్మాన ప్రసాదరావు వామపక్ష పార్టీలు, ప్రజా సంఘాల నాయకులను అభివృద్ధి నిరోధకులుగా అభివర్ణించడంతో పాటు థర్మల్ ప్రాజెక్టులకు అడ్డం వస్తే రోడ్డు రోలర్‌తో తొక్కేస్తానంటూ అప్పట్లో హెచ్చరించిన వైనాన్ని చూశాం. ప్రజలు ఏదీ కోరుకుంటున్నారో అవి నెరవేర్చకుండా పాలకులకు ఏది నచ్చితే అది చేస్తాంటే కచ్చితంగా తిరగబడతారు.

సోంపేట, కాకరపల్లి థర్మల్ పవర్ ప్లాంట్ల విషయంలో అదే జరిగింది. జిల్లాను అభివృద్ధి చేయడానికి ఏదీ లేదనట్లుగా ప్రజల జీవితాలను నాశనం చేసే ప్రాజెక్టులను జనం నెత్తిన రుద్దాలని చూస్తే దానిని తిప్పిగొట్టకమానరు. రణస్థలం మండలం కొవ్వాడలో ప్రతిపాదిత అణు విద్యుత్కేంద్రం చాలా ప్రమాదకరమైనదని, పర్యావరణం, సమస్త జీవ కోటికి నష్టం వాటిల్లుతుందని పర్యావరణ నిపుణులు హెచ్చరించినా బలవంతంగా అక్కడ ఏర్పాటు చేసే ప్రయత్నాలు 2014-19 టిడిపి హయాంలోనే మొదలయ్యాయి. వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు నాటి టిడిపి ప్రభుత్వంలో బిసి సంక్షేమశాఖ మంత్రిగా ఉండి ప్రభుత్వ నిర్ణయాన్ని సమర్ధించారు తప్ప ప్రజల భద్రత అంశం తనకు సంబంధం లేనట్లుగా వ్యవహరించారు.

కేంద్రపౌర విమానయాన మంత్రిగా ఉన్న రామ్మోహన్ నాయుడు జిల్లాకు ఎయిర్ పోర్టు తీసుకొస్తానంటే వెంటే జెండాలు పట్టుకుని లేస్తున్నారంటూ, ఇలా అయితే ఎక్కడ అభివృద్ధి జరగుతుందంటూ అదే సభలో మాట్లాడారు. పారిశ్రామికవేత్తలు, సరుకు రవాణ కోసం కార్గో ఎయిర్‌పోర్టుకు ప్రతిపాదనలు చేస్తూ పోర్టు నిర్మాణంతోనే అభివృద్ధి చెందిపోతున్నట్లుగా భ్రమలు కల్పిస్తున్నారు. ఎయిర్‌పోర్టుకు ప్రభుత్వ భూములో లేక ఖాళీగా ఉన్న ఉప్పు భూములు వినియోగిస్తున్నారంటే పచ్చని ఉద్దాన ప్రాంత భూములను ఎయిర్ పోర్టు పేరుతో తీసుకునేందుకు ప్రభుత్వం ప్రయత్నం చేస్తోంది. ఫలానా చోట ఎయిర్ పోర్టు కడుతున్నామని కనీసం స్థానిక ప్రజలకు చెప్పకుండా, వారి అభిప్రాయాలను తెలుసుకోకుండా ఏకపక్షంగా వ్యవహరించడం ద్వారా స్థానికులు రోడెక్కె పరిస్థితిని మంత్రి అచ్చెన్నాయుడే సృష్టించి జెండాలు పట్టుకుని లేస్తున్నారంటూ జనాన్ని నిందించడం అమాత్యులకే చెల్లింది.

జిల్లా వాసులు ఎక్కడికో వెళ్లి కష్టపడుతున్నారని, మన దగ్గర అవకాశాలు లేవా? అని మంత్రి అచ్చెన్నాయుడు ఇప్పుడు గుర్తించినట్టున్నారు. వెనుకబడిన జిల్లా అంటూ ముసలికన్నీరు కారుస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు రెండు సార్లు మంత్రి అయినా జిల్లాకు కనీసం ఒక్క పరిశ్రమ తీసుకురాలేకపోయారు. రాష్ట్ర విభజన తర్వాత కేంద్ర ప్రభుత్వం ఉన్నత విద్యా సంస్థలను రాష్ట్రానికి కేటాయిస్తే మంత్రిగా ఉన్న అచ్చెన్నాయుడు కనీసం జిల్లాకు ఒక్క విద్యా సంస్థను తీసుకొచ్చే ప్రయత్నం చేయలేకపోయారంటూ అప్పట్లో విమర్శలను ఎదుర్కున్నారు. జిల్లాలో 193 కి.మీ మేర సుదీర్ఘ సముద్రతీరం ఉందని, కష్టపడే మనుషులు ఉన్నారంటూ చెప్పుకొచ్చారు. మంత్రి అచ్చెన్నాయుడు తొలిసారి ఎమ్మెల్యే అయిన నాటి నుంచి అదే సముద్రతీరం, అదే కష్టపడే మనుషులు ఉన్నారు. కాకపోతే సుదీర్ఘ సముద్రతీరం ఉన్న సిక్కోలు తీరం వెంబడి మత్స్యకారుల కోసం కనీసం కోల్డ్ స్టోరేజ్, జెట్టీని కట్టలేకపోయారు.

గలగల పారే వంశధార, నాగవళి, బహుదా నదులు ఉన్నాయని, జిల్లాకు ఏం తక్కువ లేదని సహకారమే తక్కువంటూ అని వ్యాఖ్యలు చేయడం ద్వారా అసంపూర్తి సాగునీటి ప్రాజెక్టుల విషయాన్ని మరచినట్లు ఉన్నారు. 2014లో టిడిపి అధికారంలోకి వచ్చిన తర్వాత సగం పనులు పూర్తయిన వంశధార స్టేజ్-2 ఫేజ్-2 పూర్తి చేయడానికి టిడిపి ప్రభుత్వానికి ఐదేళ్లు సరిపోలేదు. ఇప్పటికీ ఆ ప్రాజెక్టు ఎప్పుడు పూర్తవుతుందో రైతులు ఎదురుచూడాల్సిన పరిస్థితిని తీసుకొచ్చారు. ఆఫ్‌షోర్ రిజర్వాయరుదీ అదే పరిస్థితి. వంశధార, ఆఫ్‌షోర్‌లను పూర్తి చేయడానికి ఏ జెండాలు అడ్డం వచ్చాయో మంత్రి అచ్చెన్నాయుడే చెప్పాలి. ఆమదాలవలస చక్కెర పరిశ్రమను సహకార రంగంలో తెరిపించాలని రైతులు అడుగుతుంటే అది పట్టించుకోవడం మానేసి పచ్చని పొలాల్లో కార్గో ఎయిర్‌పోర్టు నిర్మిస్తామని చెప్తున్నారు. ముడిసరుకు, విద్యుత్ బిల్లుల భారంతో జ్యూట్ పరిశ్రమలు మూతపడుతుంటే, వాటిని తెరిపించే చర్యలు విడిచిపెట్టి బూర్జ-సరుబుజ్జిలిలో ప్రజలకు నష్టం కలిగించే థర్మల్ విద్యుత్కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామంటున్నారు. ప్రజలకు ఒకటి అడుగుతుంటే, ప్రభుత్వ పెద్దలు వారికి ప్రయోజనం చేకూరే ప్రాజెక్టులను, పోర్టులను తీసుకొస్తుండటాన్నే ప్రజలు వ్యతిరేకిస్తున్నారన్న వాస్తవాన్ని మంత్రి అచ్చెన్నాయుడు ఇప్పటికయినా గుర్తించాలి. ఆరు సార్లు ఎమ్మెల్యే, రెండు సార్లు మంత్రిని అయ్యానని, తనకు దేని మీద మోజు లేదని మంత్రి అచ్చెన్నాయుడు ప్రకటించిన నేపథ్యంలో ఇక తన సమయాన్ని అంతటినీ ప్రజలు కోరుకుంటున్న అభివృద్ధి, ప్రత్యామ్నాయ విధానాల వైపు దృష్టి సారించగలరని ఆశిద్దాం.


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న యుటిఎఫ్ నాయకులు

పాలకుల విధానాలతో ప్రభుత్వ బడులకు ముప్పు

యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు బాబూరావు

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

పాలకులు విధానాల ఫలితంగా ప్రభుత్వ బడులకు ముప్పి ఏర్పడిందని, ప్రభుత్వ బడిలో చేరేల సంఖ్య క్రమేపి తగ్గుతూ ప్రభుత్వ విద్యారంగం నెమ్మదిగా కనుమరుగయ్యే ప్రమాదంలో పడిందని, ప్రభుత్వ విద్యారంగాన్ని ఉపాధ్యాయులే కాపాడు కోవాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు లండ బాబూరావు అన్నారు. కోటబొమ్మాళి జిల్లా పరిషత్ కార్యాలయంలో శనివారం యుటిఎఫ్ ప్రాంతీయ సమావేశం నిర్వహిఁచారు. ఈ సందర్భంగా బడిఈడు పిల్లలందరినీ ప్రభుత్వ బడిలో చేర్పించాలన్న పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ ప్రభుత్వ విద్యారంగం ఉంటేనే పేదలకు, బలహీనవర్గాలకు చదువు అందు తుందన్నారు. కనుక ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకునే కృషి చేపట్టాల న్నారు. అందుకు విద్యార్థుల తల్లిదండ్రులను ఒప్పించండి ప్రభుత్వ బడులలో చేర్పించేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శులు గొండు నారాయణరావు, వాసుదేవరావు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వెంకన్న చౌదరి

నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం

ప్రజాశక్తి- పలాస

పలాస నియోజకవర్గం అభివృద్ధి పథంలో నడిపించడమే లక్ష్యంగా పెట్టుకున్నామని నియోజకవర్గ టిడిపి సమన్వయకర్త యార్లగడ్డ వెంకన్న చౌదరి అన్నారు. స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో టిడిపి, జనసేన, బిజెపి నాయకులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని,, ఎనీటి ఎద్దడి నివారణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని తెలిపారు. తాగునీరు సరఫరా చేసేందుకు ముమ్మరంగా పనులు చేపడుతున్నామన్నారు. వచ్చే ఖరీఫ్ సీజన్‌లో వంశధార శివారు భూములకు సరఫరా చేస్తామని చెప్పారు. ఎక్కడైనా ప్రజలు సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని మీ దృష్టికొస్తే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. తక్షణమే పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. గ్రామాల్లో సిసి రోడ్లు, కాలువలు నిర్మాణం చేపడుతున్నామన్నారు. సమావేశంలో ఎపి ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు, టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి పి.విఠల్‌రావు, లొడగల కామేశ్వరరావు, గురిటి సూర్యనారాయణ, గాలి కృష్ణారావు, డొక్కరి శంకర్, కొరికాన శంకర్, టంకాల రవిశంకర్ గుప్త, మల్లా శ్రీనివాసరావు సంతోష్ పండా పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న సిహెచ్‌ఒలు

సిహెచ్‌ఒల నిరసన

అరసవల్లి: వైద్య ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న సిహెచ్‌ఒలు తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ డిఎంహెచ్‌ఒ కార్యాలయం ముందు శనివారం శాంతియుతంగా నిరసన తెలిపారు. గత రెండేళ్లుగా జీతభత్యాలు విషయంలో ఎన్నో సమస్యలను ఎదుర్కొంటున్నామని, రాష్ట్ర వ్యాప్తంగా 10032 మంది, జిల్లా వ్యాప్తంగా 594 మంది ఆయుష్మాన్ ఆరోగ్య విభాగంలో పంచాయతీకి ఒకరు చొప్పున కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్నామని, తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరారు. ఆరేళ్ళు దాటిన సిహెచ్‌ఒలను క్రమంబద్ధికరించాలని, ఎన్‌హెచ్‌ఎంలోని ఇతర ఉద్యోగులతో సమానంగా 23శాతం ఇంక్రిమెంట్ ఇవ్వాలని, ప్రతినెల జీతంతో పాటు ఇన్సెంటివ్ ఇవ్వాలని, ప్రతి సంవత్సరం 5 శాతం ఇంక్రిమెంట్ ఇవ్వాలని, ఆర్థికమైన, ఆర్థికేతర సమస్యలను తీర్చే విధంగా హామీ ఇవ్వాలన్నారు. ఈ డిమాండ్లను పరిష్కరించే వరకు శాంతియుతమైన నిరసనలు కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఎం.ఉషారాణి, వైస్ ప్రెసిడెంట్ సిహెచ్ జ్యోతి, డి.శ్రావణి, సిహెచ్ రాజీవ్, జి.రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన చిరు వ్యాపారులు

శ్రీకాకుళం: అరసవల్లి మిల్లు జంక్షన్ నుంచి ఇందిరా విజ్ఞాన్ భవన్ వరకు రోడ్డుకు ఇరువైపులా ఉన్న దుకాణాలను రథసప్తమి వేడుకల్లో భాగంగా తొలిగించారని, వాటిని తిరిగి పునరుద్ధరించుకునేందుకు


ఎమ్మెల్యేతో మాట్లాడుతున్న చిరువ్యాపారులు

అవకాశం కల్పించాలని నగర వర్తకులు ఎమ్మెల్యేను కోరారు. శనివారం ఉదయం ఆయనను కలిసి సమస్యలను వివరించారు. చిరు వ్యాపారులంతా గడచిన మూడు దశాబ్దాలుగా ఈప్రాంతంలోనే చిరువ్యాపారాలు సాగిస్తూ జీవనం సాగిస్తున్నామని వివరించారు. అయితే చిరు వ్యాపారులకు నగరపాలక సంస్థ ఆధ్వర్యాన శాశ్వతంగా దుకాణాలు కట్టించి ఇచ్చేందుకు కృషి చేస్తున్నట్టు ఎమ్మెల్యే వారికి హామీఇచ్చారు.

లచ్చన్న సేవలు చిరస్మరణీయం

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

బడుగు, బలహీన వర్గాల కోసం అలుపెరగని పోరాటం చేసిన ఉద్యమకారులు సర్దార్ గౌతు లచ్చన్న అని వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు కొని యాడారు. స్వాతంత్ర్య సమరయోధుడిగానే కాక భారత రాజకీయాల్లో తనదైన ముద్ర వేసిన వ్యక్తని పేర్కొన్నారు. లచ్చన్న వర్థంతి సందర్భంగా ఆయనకు ఘన నివాళ్లర్పి స్తున్నట్లు పేర్కొన్నారు.

నరసన్నపేట : స్థానిక జ్ఞానజ్యోతి జూనియర్ కళాశాలలో లచ్చన్న చిత్రపటానికి శ్రీశయన సంఘం నాయకులు టి.వి. చంద్రమోహన్‌దేవ్ పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో దంత త్రినాథరావు, డొంకాన అసిరి నాయుడు, వంజల రామరాజు, కోల రాము, బతకల గోపి, సరిపల్లి మధు, డొంకాన మణి పాల్గొన్నారు.

సోంపేట : స్థానిక శ్రీశయన సంఘ భవనం వద్ద ఉన్న లచ్చన్న విగ్రహానికి ఆ సంఘ అధ్యక్షులు లొట్ల దీనబంధు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో వెంకటేశ్వరస్వామి ఆలయ ధర్మకర్త పొందూరు తిరుపతిరావు, టౌన్ అధ్యక్షులు రెల్ల నారాయణ, జిల్లా


వజ్రపుకొత్తూరు : విగ్రహం వద్ద నివాళ్లర్పిస్తున్న టిడిపి నాయకులు

సంఘ ఉప కోశాధికారి తుంగాన ఇంద్రరావు, తట్ట షణ్ముఖరావు, పర్రి కృష్ణారావు పాల్గొన్నారు.

పలాస : పలాసలోని సర్దార్ గౌతు లచ్చన్న విగ్రహానికి టిడిపి నియోజకవర్గ సమన్వయకర్త యార్లగడ్డ వెంకన్న చౌదరి పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లర్పించారు. కార్యక్రమంలో ఎపి ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు, టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి పి.విఠల్‌రావు, లొడగల కామేశ్వరరావు, గురిటి సూర్యనారాయణ, గాలి కృష్ణారావు, డొక్కరి శంకర్, కొరికాన శంకర్, టంకాల రవి శంకర్ గుప్తా, మల్లా శ్రీనివాసరావు, కొత్త సత్యం, చెల్లూరు రామకృష్ణ, సాసుమాన చంద్రమౌళి, నాగరాజు పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు : మండలంలోని రెయ్యిపాడులో లచ్చన్న విగ్రహానికి టిడిపి మండల అధ్యక్షులు సూరాడ మోహనరావు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో అగ్నికుల క్షత్రియ డైరెక్టర్ పుచ్చ ఈశ్వరరావు, అరసవల్లి ఉమామహేశ్వరరావు, ఎంపిటిసి చిట్టిబాబు, అఖిల్, గోవింద పాపారావు, కార్ని రమణ, వంక రామారావు, సూల శాంతారావు, కొల్లి రమేష్, సైనీ బాలాజీ, వైకుంఠారావు, నారాయణస్వామి పాల్గొన్నారు.

శ్రీకాకుళం: బలహీన వర్గాల అభ్యున్నతికి అనేక పోరాటాలు చేసిన మహనీయుడు గౌతు లచ్చన్న అని తెలుగుమహిళ నియోజకవర్గ అధ్యక్షురాలు గొండు స్వాతి అన్నారు. ఆయన 19వ వర్థంతిని పురస్కరించుకుని నగరంలోని డేఅండ్‌నైట్ కూడలి వద్ద ఆయన విగ్రహానికి కూటమి నాయకులతో కలిసి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో ముద్దాడ కృష్ణమూర్తి నాయుడు, జామి భీమశంకర్, చిట్టి నాగభూషణం, నాయకులు పాల్గొన్నారు.


శుభ్రం చేసిన జీడి పిక్క బొమ్మ కూడలి

చెత్తా చెదారం తొలగింపు

'ప్రజాశక్తి' కథనానికి స్పందన

ప్రజాశక్తి- పలాస

పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో శుక్రవారం కురిసిన వర్షానికి రోడ్డపై చెత్తా చెదారం పేరుకుపోయింది. దీంతో మున్సిపల్ అధికారులు స్పందించి రోడ్లపై పేరుకుపోయిన చెత్తా చెదారాలను శనివారం తొలగించారు. ఈ నెల 18న 'ప్రజాశక్తి'లో 'చినుకు పడితే అంతే..' శీర్షికతో వెలువడిన కథనానికి మున్సిపల్ కమిషనర్ ఎన్.రామారావు స్పందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పలాస జీడి పిక్క బొమ్మ, ఆంజనేయ స్వామి ఆలయం ఆవరణ, కాశీబుగ్గ మూడు రోడ్ల కూడళ్ల వద్ద విపరీతంగా పేరుకుపోయిన చెత్తా చెదారాలను శుభ్రం చేయించామని తెలిపారు.

క్రైమ్ కార్నర్

మహిళ హత్య!

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

మండలంలోని పైడిభీమవరం కూడలి దగ్గర ఉన్న కాజా కోనేరు వద్ద గుర్తుతెలియని వ్యక్తి హత్య చేశాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గొల్లపేటకు చెందిన ఎ.భవానీ (22) గుర్తు తెలియని వ్యక్తి బ్లేడుతో పీకపై బలమైన గాయపరిచి చంపేశాడు. అనంతరం అక్కడి నుంచి పరారయ్యాడు. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సిఐ ఎం.అవతారం, ఎస్ఐ చిరంజీవి, క్లూస్ టీం చేరుకొని పరిశీలిస్తున్నారు. ఈమె ఒక హోటల్లో రోజు కూలీగా పనిచేస్తూ జీవితాన్ని వెల్లబుచ్చుతుంది. భర్త వెంకట సత్యం లారీ డ్రైవర్. ప్రస్తుతం డ్యూటీలో ఉన్నాడు. మృతురాలికి మూడేళ్ల కుమార్తె ఉంది. మృతురాలి తమ్ముడు బి.సాయి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మిగతా వివరాలు తెలియాల్సి ఉంది.

వ్యక్తి అదృశ్యం

పొందూరు: పొందూరు పట్టణానికి చెందిన తెలుగు ఉపాధ్యాయుడు బుగత రమణబాబు అదృశ్యంపై ఆయన భార్య సంతోషికుమారి శనివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్ఐ సత్య నారాయణ తెలిపారు. ఈయన శుక్ర వారం సాయంత్రం ఇంట్లో ఎవరికీ చెప్ప కుండా బయటికి వెళ్లి తిరిగి రాలేదని తెలి పారు. ఈయన విజయనగరం జిల్లా రేగిడి ఆమదాలవలస మండలం లక్ష్మీపురంలో తెలుగు ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారని తెలిపారు.

యువకునికి పాముకాటు

పొందూరు: పొందూరు మేజర్ పంచాయతీ పరిధిలోని లక్ష్మీపేటలో శనివారం రాత్రి వై. పోలిరాజు అనే యువకుడు పాముకాటుకు గురయ్యాడు. జి.సిగడాం మండలం చెట్టు పొదిలాంకు చెందిన పోలిరాజు లక్ష్మీపేటలో జరుగు తున్న ఓ ఆధ్యాత్మిక కార్యక్రమానికి మైక్ సెట్ బాయ్‌గా వచ్చాడు. రాత్రి సమయంలో మైక్ సెట్ వద్ద ఉన్న పోలిరాజును పాముకాటు వేయడంతో గ్రామానికి చెందిన యువకులు పొందూరు ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం జిల్లా ఆస్పత్రికి రిఫర్ చేశారు.

10 కేజీల గంజాయి స్వాధీనం


మాట్లాడుతున్న డిఎస్‌పి వి.వి.అప్పారావు

ప్రజాశక్తి- పలాస

'గూఢాచారి సినిమాలు మనం చూసి ఉంటాం... అందులో స్మగ్లర్లు తమ సరకులు గమ్యస్థానం చేర్పించేందుకు రకరకాల టిప్పులు చేస్తుంటారు. సరుకులు అందించే వారి వివరాలు వెల్లడించకుండా టోపీలు, దుస్తులు వంటి ఐడెంటీని చెబుతూ వారికి సరకులు అప్పగిస్తూ... చాకచక్యంగా వ్యవహరిస్తుంటారు'. అచ్చం అటువంటి సినిమాలు మాదిరిగానే గంజాయి స్మగ్లర్లు పట్టుబడకుండా రెడ్‌క్యాప్ పేరుతో నిర్వహించిన ఆపరేషను ను కాశీబుగ్గ పోలీసులు బట్టబయలు చేశారు. శనివారం పలాస రైల్వేస్టేషన్ రోడ్డులో 10 కిలోల గంజాయి తరలిస్తున్న ఇద్దరు ఒడిశా వాసులను పట్టుకోవడంతో మొత్తం గుట్టు రట్టయింది. కాశీబుగ్గ డిఎస్‌పి వి.వెంకట అ ప్పారావు చెప్పిన వివరాల మేరకు... ఒడిశా రాష్ట్రం ఆర్.ఉదయగిరికు చెందిన తపన్బెబర్త, మననిక్సింగ్‌లు ఇద్దరు క్రికెట్‌లో పరిచయమైన స్నేహితులుగా మారారు. వీరు చెడువ్యవసనాలకు బానిసై గంజాయి రవాణాకు అలవాటు పడ్డారు. హైదరాబాద్‌లో గంజాయి అమ్మకందారులకు ఇస్తే రూ.10వేలు కమిషన్ వస్తుండడంతో ఇదే స్మగ్లింగ్‌కు అలవాటు పడ్డారు. ఈ క్రమంలో ఇద్దరూ గంజాయి కొనుగోలు చేసుకొని పలాస రైల్వే స్టేషన్‌కు చేరుకున్నారు. గంజాయి అమ్మకందారులు పలాసలో రైల్వే స్టేషన్‌కు రావడంతో వారిని గుర్తించడానికి ఆనవాలు చెప్పడంతో ఆ విధంగా గంజాయిని ఇచ్చేందుకు సిద్ధమయ్యారు. ఎరుపు రంగు టోపీ వ్యక్తికి గంజాయి బ్యాగును ఇవ్వాల్సి ఉంది. ఆ క్రమంలో ఎరుపు టోపీ వ్యక్తికోసం వెతుకుతున్న క్రమంలో తనిఖీలు నిర్వహిస్తున్న కాశీబుగ్గ సిఐ పి.సూర్యనారాయణ, సిబ్బంది కంటపడ్డారు. వెంటనే బ్యాగులను పరిశీలించగా, గంజాయి బయట పడింది. విషయం ఆరా తీయడంతో ఆపరేషన్ రెడ్‌క్యాప్ వ్యవహారం బయట పడింది. దీంతో పోలీసులు వారి తెలివితేటలకు విస్తుపోయారు. నిందితులను అరెస్టు చేసి పలాస కోర్టులో హాజరపరచగా 14 రోజులు రిమాండ్ విధించినట్లు డిఎస్‌పి తెలిపారు. ఈ మేరకు గంజాయి ముఠాను పట్టుకున్న పోలీసులకు అభినందించారు.


మెళియాపుట్టి : సామగ్రిని స్వాధీనం చేసుకున్న పోలీసులు

బెల్లం ఊటలు ధ్వంసం

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మండలంలోని భరణికోట పంచాయతీ బాలేరు, మర గ్రామాల్లో టెక్కలి సెబీ ఎన్‌ఫోర్స్‌మెంట్ సిఐ షేక్ మీరా సాహెబ్ ఆధ్వర్యాన నాటుసారా స్థావరాలపై శనివారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 1800 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. అలాగే 20 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేశారు. అనంతరం గ్రామస్తులకు నాటుసారా తయారీ వల్ల నష్టాలను తెలియజేశారు. కార్యక్రమంలో మెయాపుట్టి ఎస్ఐ పి.రమేష్ బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

మందస: మండలంలోని పలు గ్రామాల్లో ఎక్సైజ్ సిఐ బేబి నాటుసారా స్థావరాలపై దాడులు నిర్వహించి వెయ్యి లీటర్ల బెల్లం ఊటలను ధ్వంసం చేశారు.

ప్రతిపక్షాల నిర్వీర్యానికి బిజెపి కుట్ర

శ్రీకాకుళం: దేశంలో ప్రతిపక్షాలను నిర్వీర్యం చేయాలన్న ఉద్దేశంతోనే సోనియాగాంధీ, రాహుల్‌పై ఇడి చేత కేసులు పెట్టించిన బిజెపి ప్రభుత్వ, ఇప్పుడు మత విద్వేషాలను రెచ్చ గొట్టేందుకు ప్రయత్నిస్తున్నారని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు అంబటి కృష్ణారావు ఆరోపించారు. నగరంలోని ఇందిరా విజ్ఞాన్ భవన్‌లో శనివారం విలేకరులతో మాట్లాడారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మత సామరస్యం దెబ్బతిని ప్రాంతాలు, మతాల మధ్య చిచ్చు రేగుతోందని అన్నారు. అధికారంలో ఉన్న మంత్రులే రెచ్చగొట్టే రీతిలో మాట్లాడుతున్నారన్నారు. ప్రజల సమస్యలను పట్టించుకోకుండా కార్పొరేట్ సంస్థలకు దేశప్రయోజనాలు కట్టబెట్టే రీతిలో పాలన సాగిస్తున్నారన్నారు. మరోవైపు తప్పులను కప్పి పుచ్చుకునేందుకు విపక్షాలను నిర్వీర్యం చేసేందుకు ఇడి, సిబిఐ, ఎన్‌ఫోర్స్‌మెంట్ వంటి సంస్థల చేత దాడులు చేయించి వేధింపులకు గురిచేస్తున్నారన్నారు. కాంగ్రెస్ ఆస్తులను, పార్టీ కార్యాలయాలపై దాడులు చేయిస్తున్నారన్నారు. అందులో భాగంగానే బిజెపి నాయులు కాంగ్రెస్ కార్యాలయాల ఎదుట నిరసనలు చేపట్టడం విడ్డూరంగా ఉందన్నారు. బిజెపి అరాచక పాలనకు భయపడేదిలేదన్నారు.


మాట్లాడుతున్న కృష్ణారావు

భూసార పరీక్షలతోనే మేలైన దిగుబడులు

ప్రజాశక్తి- రణస్థలం

భూసార పరీక్షల ద్వారానే పంటకు అవసరమయ్యే ప్రధాన, సూక్ష్మపోషకాల స్థాయిని గుర్తించి తదనుగుణమైన పంటలు వేసి, ఎరువుల యాజమాన్యం పాటించడం వలన మేలైన దిగుబడులు సాధించవచ్చని డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ డిప్యూటీ మేనేజర్ ఆర్.హరిబాబు అన్నారు. శనివారం సంచాం గ్రామంలో మీసాల హేమలరావు పొలంలో భూసార పరీక్షల కోసం మట్టి నమూనా సేకరణ విధానంపై రైతులకు క్షేత్రస్థాయిలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రైతు భూసార పరీక్షలు చేసుకోవడం వలన రసాయన ఎరువులపై అనవసర ఖర్చును తగ్గించుకోవచ్చునన్నారు. ఈ ఏడాది రైతుల ప్రయోజనార్థం డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో భూసార పరీక్షల వనరుల కేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందని, భూసార పరీక్షలు చేయించుకునే రైతులకు పరీక్ష నివేదిక ఆధారంగా భూమి చౌడు గుణం, పోషకాల శాతం, కాలుష్యాన్ని గుర్తించి దానికి అనుగుణంగా నిర్దిష్ట క్షేత్రస్థాయి పోషక నిర్వహణకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. తమ


మట్టి నమూనాలు సేకరిస్తున్న ఫౌండేషన్ సభ్యులు

భూసార పరీక్షల వనరుల కేంద్రంలో సుమారు 13 అంశాలను పరీక్షించి నివేదిక అందిస్తున్నామని జిల్లాలోని రైతు సోదరులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ఏరియా మేనేజర్ పతివాడ తవిటినాయుడు, రెడ్డీస్ ఫౌండేషన్ సమన్వయకర్తలు ఎస్.పి.నారాయణరావు, డి.శ్రీనువాసరావు, రైతులు గొర్లె రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.


నారాయణపురం ఆనకట్ట వద్ద తగ్గిన నీటిమట్టం

తగ్గిన 'నారాయణపురం' నీటి మట్టం

ప్రజాశక్తి- బూర్జ

నాగావళి నది ఎడారిని తలపిస్తుంది. నదిలో చుక్కనీరు లేకపోవడంతో నదీతీర గ్రామాలకు తాగునీటి కష్టాలు ప్రారంభమయ్యాయి. మండలంలోని వై.పర్త, కిలంతరి, అల్లెన, బూర్జ, వావాం, కాఖండ్యాం, లంకాం, నారాయణపురం, లాభాం, గుత్తావల్లి తదితర నదీతీర గ్రామాలు తాగునీటి కోసం అవస్థలు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా మూగజీవాలు తాగునీరు లేకపోవడంతో విలవిలలాడుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వేసవిని దృష్టిలో ఉంచుకొని నీటిని విడుదల చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఖరీఫ్‌కు పక్కాగా నీరందించాలి

ఎచ్చెర్ల: ఎచ్చెర్ల మండలంలో ఉన్న శివారు ప్రాంతానికి సాగునీరు అందించే ప్రయత్నంలో భాగంగా ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు శనివారం నారాయణపురం ఆనకట్ట వద్దకు వెళ్లి అక్కడ పరిస్థితులను అధికారులతో కలిసి పరిశీలించారు. ఎట్టిపరిస్థితుల్లో రాబోయే ఖరీఫ్‌లో ఎచ్చెర్ల మండలంలోని రైతులకు సాగునీరు అందించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని శివారు భూములకు సాగునీరు అందించేందుకు పూర్తిస్థాయిలో ప్రయత్నిస్తున్నామని, ఈ విషయమై సిఎం చంద్రబాబుని కలిసి విన్నవించడం జరిగిందని, ఖరీఫ్ సీజన్‌కు నీరు అందించాలనే ప్రయత్నం ముమ్మరం చేస్తున్నామన్నారు. ఈ పర్యటనలో తోటపాలెం, ఫరీద్‌పేట, కుశాలపురం, ఇబ్రహీంబాద్, కొత్తపేట, సెగిడిపేట, ముద్దాడ, ఒఎ అగ్రహారం, రామజోగిపేట, ధర్మవరం, కమ్మపేట, పొన్నాడ, కొంగరాం తదితర గ్రామాల నాయకులు, రైతులు ఉన్నారు.


నారాయణపురం ఆనకట్ట వద్ద అధికారులు, రైతులతో ఎమ్మెల్యే ఈశ్వరరావు

సమస్యల పరిష్కారానికే గ్రామసభ

ఆమదాలవలస: బలసలరేవు వంతెన అప్రోచ్ రోడ్డు భూసేకరణలో రైతులకు ఎటువంటి అభ్యంతరాలు ఉన్నా తెలియజేయాలని తహశీల్దార్ ఎస్.రాంబాబు తెలిపారు. శనివారం మండలంలోని ఇసుకలపేటలో రెవెన్యూ అధికారులు గ్రామసభను నిర్వహించారు. గ్రామంలో నాగావళి నది తీరంలో బ్రిడ్జి కోసం అప్రోచ్ రోడ్డు నిర్మాణం జరుగుతుందని, దానికి అవసరమైన భూసేకరణ పూర్తి చేసినట్లు తెలిపారు. ఈ భూ సేకరణకు సంబంధించి రైతులకు ఎటువంటి సందేహాలు, అభ్యంత రాలున్నా ఫిర్యాదు చేయాలని సూచించారు. సమావేశంలో భూసేకరణ ప్రత్యేక తహశీల్దార్ పి.శ్రీనివాసరావు, సర్వేయర్ బొడ్డేపల్లి గోవిందరావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ గోవింద రావు, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

చేతగానితనాన్ని చెప్పకుంటున్నారు...

ప్రజాశక్తి- కవిటి

తన అసమర్థత, చేతగానితనం ఇతరుల మీదకు నెట్టేసి లండారిపుట్టుగ సర్పంచ్ పంచాయతీ ప్రజలను ఇంకా మోసం చేస్తూనే ఉన్నారని వైసిపి నాయకులు రామస్వామి, నీలకంఠం ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను పంచాయతీ అభివృద్ధికి చేస్తున్న ప్రయత్నాలు ఎమ్మెల్సీ రామారావు అడ్డుకుంటున్నారనే సర్పంచ్ మురపాల కుమారి, ఆమె భర్త కాశీప్రసాద్ ఆరోపణలను వీరు తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు శనివారం విలేకరులతో మాట్లాడారు. మరికొద్ది నెలల్లో తన పదవీ కాలం పూర్తవుతుందనగా సర్పంచ్ ఇప్పుడు దొంగ ఏడుపులు, పెడబొబ్బలు పెడుతున్నారని ఎద్దేవా చేశారు. అధికార పార్టీలో ఉంటూ ప్రతిపక్ష నేత తనను అడ్డుకుంటున్నారనడం తన అసమర్థతకు నిదర్శనమని అన్నారు. తనకు పిలవకుండానే


మాట్లాడుతున్న వైసిపి నాయకులు

ఉపాధి హామీ పనులు ప్రారంభించేశారంటే ఇక ఆ సర్పంచ్ కు కూటమిలో ఎంత పరపతి ఉందో అర్థమవుతోందని వీరు ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా ఇటువంటి చవుకబారు ఆరోపణలు మానేసి పంచాయతీ అభివృద్ధిపై దృష్టి సారించాలని హితవు పలికారు. మరోసారి ఎమ్మెల్సీపై వ్యక్తిగత విమర్శలు చేస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవలసి ఉంటుందని హెచ్చరించారు. సమావేశంలో ఆనంద్, చంద్రయ్య, బాలు, వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రాలు ప్రారంభం

ప్రజాశక్తి- సరుబుజ్జిలి

మండల కేంద్రంలో జనసేన నాయకులు ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి పేడాడ రామ్మోహనరావు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెరుగుతున్న ఉష్ణోగ్రతల కారణంగా జనసేన తరఫున ప్రజల దాహార్తిని తీర్చేందుకు మండల అధ్యక్షులు పైడి మురళీ మోహన్ చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు కీర్తి సుశీల, తులగాపు ధనుంజయ్, పేడాడ రమణ, మిన్నారావు, బాల మురళీ, తోట


సరుబుజ్జిలి : చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న రామ్మోహనరావు


పొందూరు : చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ లక్ష్మి

అప్పలరాజు, భార్గవ్, రాంబాబు, ప్రసాద్, కళ్యాణ్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో

పొందూరు: పట్టణంలో సత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సర్పంచ్ రేగడి లక్ష్మి ప్రారంభించారు. ఈ సందర్భంగా చలివేంద్రంలో మజ్జిగ, మినరల్ వాటర్ ను పాలిశెట్టి సూర్యం జ్ఞాపకార్థం ఆయన మనమలు పి.వి.ప్రసాద్, వాణిలు అందజేశారు. కార్యక్రమంలో కన్వీనర్ సాయిరాం, సత్యసాయి సేవాదళ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

రణస్థలం: రణస్థలం అగ్నిమాపక శాఖ అధికారి పైల అశోక్ ఆధ్వర్యంలో శనివారం అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా పైడిభీమవరం గ్లోబల్ స్పెషాలిటీ ఆస్పత్రి ప్రాంగణంలో వైద్యులతో పాటు నర్సులకు, సెక్యూరిటీ సిబ్బందికి, ఆస్పత్రికి వచ్చిన ప్రజలకు అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించారు. అగ్నిప్రమాదం జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అడ్మిషన్‌లో ఉన్న పేషెంట్లను అగ్ని ప్రమాదం జరిగినప్పుడు బయటికి ఎలా తీసుకు రావాలనే అంశాలపై సూచనలు, సలహాలు ఇచ్చారు.

ఇచ్ఛాపురం: అగ్నిమాపక వారోత్సవాలు సందర్భంగా స్థానిక ప్రభుత్వ కమ్యూనిటీ ఆస్పత్రిలో వైద్య సిబ్బందికి సిపిఆర్‌పై అగ్నిమాపకాధికారి ప్రశాంత్‌కుమార్ ఆధ్వర్యాన సూర్యారావు అవగాహన కల్పించారు. వైద్యాధికారి


కొత్తూరు : అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక అధికారులు


రణస్థలం : అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక శాఖాధికారులు

దేవేంద్రరెడ్డి, వైద్య, అగ్నిమాపక సిబ్బంది కామరాజు, ప్రసాద్, నీలాచలం, ఈశ్వరరావు పాల్గొన్నారు.

కొత్తూరు : అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో అగ్నిమాపక అధికారి ఎన్.బుచ్చోడు సిబ్బందికి ప్రమాదాల నివారణపై అగ్నిమాపక యంత్రాల ద్వారా అవగాహన కల్పించారు.

కోటబొమ్మాళి: అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు దానినుంచి రోగులకు బయటపడేందుకు ఆస్పత్రి సిబ్బంది మెలుకవులు తెలుసుకోవాలని అగ్నిమాపక ఆధికారి పి.ఆర్.రెడ్డి అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా స్థానిక ప్రభుత్వాస్పత్రి సిబ్బందికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది కె.రమణ, డి.బాలకృష్ణ పాల్గొన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న ఎపిఎం కూర్మారావు

ఆర్థిక లావాదేవీలపై అవగాహన ఉండాలి

ఎపిఎం కూర్మారావు

మందస : గ్రామీణ ప్రాంతాల్లో మహిళలు ఒక్కొక్కరిగా సాధించలేని చాలా విషయాలు అంతా ఒక్కటై స్వయంశక్తి సంఘాల్లో సాధించగలిగారని ఐటిడిఎ వెలుగు అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ పైడి కూర్మారావు తెలిపారు. మందస పంచాయతీలో స్వయంశక్తి సంఘాల సభ్యులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిరక్షరాస్యులైన మహిళలు ఉల్లాస్ పథకం ద్వారా కొంతమేరకు అక్షరాస్యులు కాగలరని వివరించారు. మహిళలంతా సంఘంలో నిర్వహిస్తున్న ఆర్థిక లావాదేవీలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. పుస్తక నిర్వహణలో సంగ్రహ పట్టికలు వేసుకొని వ్యక్తిగత ఖాతాలో కచ్చితంగా లావాదేవీలన్నీ నమోదు చేయించుకోవాలన్నారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో క్లస్టర్ కో-ఆర్డినేటర్ బాలకృష్ణ, విఒఎలు శారద, నాగమణి పాల్గొన్నారు.



ప్రారంభిస్తున్న కమిషనర్ రమేష్

ఈ వేస్ట్ కలెక్షన్ సెంటర్ ప్రారంభం

ఇచ్ఛాపురం: రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలతో మున్సిపాలిటీలో ఈ చెక్ ఈ వేస్ట్ అనే కార్యక్రమాన్ని మున్సిపల్ కమిషనర్ ఎన్.రమేష్ శనివారం ప్రారంభించారు. అనంతరం పురపాలక సంఘం పరిధిలోని అన్ని ఎలక్ట్రానిక్ గూడ్స్ సేల్స్ అండ్ సర్వీసెస్ యజమానులకు ఈ వేస్ట్ కలెక్షన్ ఆవశ్యకతను వివరించారు. ప్రజలు ప్రతి బుధవారమూ తమ ఎలక్ట్రానిక్ వ్యర్థాలను మున్సిపాలిటీ వారికి అందించాలని కోరారు. పాడైపోయిన మొబైల్ ఫోనులు, టివిలు, ఛార్జర్లు, కంప్యూటర్లు తదితర ఎలక్ట్రానిక్ వస్తువులను ఆస్పత్రిలో రోడ్డులోని లైబ్రరీ వద్ద ఏర్పాటు చేసిన ఈ వేస్ట్ కలెక్షన్ సెంటరులో సేకరించామన్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఉపేంద్రకుమార్, వార్డు కౌన్సిలర్ కాళ్ల దిలీప్ పాల్గొన్నారు.



లావేరు : పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

లావేరు : మండలంలోని పెద్దకొత్తపల్లి పంచాయతీ కొత్తూరుపేటకు చెందిన వైసిపి నాయకుడు బగ్గు హరిబాబు తల్లి శనివారం మృతి చెందిన విషయం తెలుసుకున్న ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ వెళ్లి హరిబాబును పరామర్శించి సంతాపాన్ని తెలియజేశారు. ఈయనతో పాటు ఎంపిటిసి జనపాల బానోజీరావు, మాజీ సర్పంచ్ ఈశ్వర సత్యనారాయణ, నాయకులు గొర్లె సూరీడు, బగ్గు వేణు, బుజ్జి, గోవిందరావు, భువనేశ్వరరావు తదితరులున్నారు.

చింతాడ పరామర్శ

బూర్జ: మండలం నీలంపేటలో ఇటీవల మృతిచెందిన మొయ్యి కన్నంనాయుడు కుటుంబాన్ని ఆమదాలవలస నియోజకవర్గ ఇన్‌ఛార్జి చింతాడ రవికుమార్ పరామర్శించారు. మృతికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. ఆయనతో పాటు వైసిపి మండల అధ్యక్షుడు ఖండాపు గోవిందరావు, బూర్జ సర్పంచ్ ప్రతినిధి రాజారావు, జల్లు అప్పలస్వామి, ఎంపిటిసి ప్రతినిధి మజ్జి నరసింగరావు, సాకేటి శ్రీనివాసరావు, కార్యకర్తలు, నాయుకులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

వజ్రపుకొత్తూరు: మండలంలోని పూండి సబ్‌స్టేషన్‌లో కొత్త బ్రేకర్ ఏర్పాటు నిమిత్తం సబ్ స్టేషన్ పరిధిలో ఆదివారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామని ఎఇ జి.వి.రమణ ఒక ప్రకటనలో తెలిపారు. పూండి, పెద్దమురహరిపురం, అమలపాడు, కంబాలరాయుడుపేట, పాతటెక్కలి, కొత్తపేట, దేవునాల్తాడ గ్రామాల ప్రజలు సిబ్బందికి సహకరించాలని కోరారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

ప్రజాశక్తి- ఆమదాలవలస

పరిసరాల పరిశుభ్రత మన అందరి బాధ్యతని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. శనివారం పురపాలక సంఘంలో నిర్వహించిన స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం పురపాలక సంఘం కార్యాలయం నుంచి కొత్తకోట వారి వీధి వద్ద నున్న స్వామి వివేకానంద విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రహదారి వెంబడి ఉన్న ఎలక్ట్రానిక్ ప్లాస్టిక్ వ్యర్థాలను సిబ్బందితో కలిసి సేకరించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుదామని ఆరోగ్యాన్ని కాపాడుకుందామని ఎమ్మెల్యే రవికుమార్ అందరితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యమే మహాభాగ్యమని పరిసరాల పరిశుభ్రత ఆరోగ్యానికి ప్రధాన కారణమన్నారు. కూటమి ప్రభుత్వంలో గ్రామాలు, పట్టణాల పరిశుభ్రత కోసం ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని, చెత్త నిర్వహణ కోసం అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మెన్ తమ్మినేని గీత, టిడిపి నాయకులు మొదలవలస రమేష్, బోర గోవిందరావు, సంపదరావు మురళి, కూన ఆంజనేయులు, బగాన అమ్మినాయుడు, నాగళ్ళ మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.



ఆమదాలవలస : వ్యర్థాలను సేకరిస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

రణస్థలం రూరల్: మన ఇంటితో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు పేర్కొన్నారు. మండల కేంద్రంలో స్వచ్ఛ ఆంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి డిజిఎం ఆనందరావు, మాజీ జెడ్‌పిటిసి గొర్లె లక్ష్మణరావు, పిసిని జగన్నాథం నాయుడు, దుమ్ము అశోక్, రౌతు శ్రీనివాసరావు, సుంకర ధనుంజయరావు, నారాయణశెట్టి శ్రీనివాసరావు, మన్నె లక్ష్మి ప్రసాద్, తహశీల్దార్ నందిగాం ప్రసాదరావు, ఎంపిడిఒ కిరణ్ కుమార్, ఎపిఎం మాధవి లత, సెక్రటరీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పొందూరు: స్వచ్ఛాంధ్ర ప్రదేశ్ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని మండల ప్రత్యేకాధికారి కె.లోకేశ్వరరావు అన్నారు. మండలంలోని లోలుగు కెజిబివిలో శనివారం ప్రిన్సిపాల్ రేజేటి సౌమ్య ఆధ్వర్యంలో స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్రా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. అనంతరం పాఠశాల పరిసరాలలో పిచ్చిమొక్కలు, చెత్తాచెదారాలు తొలగించి వివిధ రకాల మొక్కలను నాటారు. కార్యక్రమంలో ఎంపిడిఒ మీసాల మన్మథరావు, ఎపిఒ శ్రీనివాసరావు, ఎపిఎం రాంమూర్తి, సచివాలయం, అంగన్వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. అలాగే తాడివలస జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం బల్ల కంటయ్య ఆధ్వర్యంలో స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో నేషనల్ గ్రీన్‌కోర్ క్లష్టర్ సమన్వయకర్త పూజారి హరిప్రసన్న, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

లావేరు: స్థానిక శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు పాఠకులు, విద్యార్థులతో స్వేచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. గ్రంథాలయ ఆవరణ పరిశుభ్రం చేశారు. కార్యక్రమములో గ్రంథాలయ సహాయకులు వీరభద్రుడు, పాఠకులు పాల్గొన్నారు.

అలాగే మండలంలోని తామాడ పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో కాలువల్లో పారిశుధ్య పనులు చేపట్టారు. కొళాయిలు, బోర్లు వద్ద పూడికలు తొలగించారు. కార్యక్రమంలో కార్యదర్శి శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

బూర్జ: మండలంలో డొంకలపర్త పంచాయతీ పరిధిలో ఉన్న గిరిజన గ్రామాల్లో స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం ఎంపిడిఒ తిరుపతిరావు ఆధ్వర్యంలో పారిశుధ్యంపై అవగాహన కల్పించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల సెక్రటరీ సంఘ అధ్యక్షుడు కె.మురళీ, గ్రామస్తులు పాల్గొన్నారు.

మెళియాపుట్టి : స్వచ్ఛాంధ్రా లక్ష్యంగా పనిచేయాలని మండల స్పెషల్ ఆఫీసర్, పలాస వ్యవసాయ శాఖ ఎడి లింగాల మధుబాబు అన్నారు. మండలంలోని మెళియాపుట్టి ప్రభుత్వ కార్యాలయాల్లో స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో తహశీల్దార్ బడే పాపారావు, ఎంపిడిఒ నరసింహ ప్రసాద్ పండా, డిటి రాము, సీనియర్ అసిస్టెంట్ జగన్మోహనరావు, ఎఇఒ ఎస్.దేవేంద్రరరావు, ఎపిఒ రవి పాల్గొన్నారు.

పలాస : మండల పరిషత్ కార్యాలయం ఆవరణ స్వచ్ఛాంధ్రాలో భాగంగా ఎంపిడిఒ వసంత కుమార్, మండల పంచాయతీ విస్తీర్ణాధికారి మెట్ట వైకుంఠరావు, కార్యాలయం ఎఒ అనురాధ శుభ్రం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రతినిధి కంచరాన భాస్కరరావు, కార్యదర్శి మీనాకుమారి, సీనియర్ అసిస్టెంట్ మన్మథరావు, లక్ష్మణరావు పాల్గొన్నారు. అలాగే రెంటికోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణను వైద్యాధికారి టి.సునీల్‌కుమార్, బోనెల గోపాల్, కార్యదర్శి సద్గుణబాబు, సూపర్‌వైజర్ రిషికేశ్వరరావు, యుడిసి సుదర్శన్, సిహెచ్ఒ అదెమ్మ, ఈశ్వరమ్మ, స్టాఫ్‌నర్సు విమలాదేవి, హేమలత, రాజేశ్వరి, చిన్నారావులు శుభ్రం చేశారు.

టెక్కలి రూరల్ : టెక్కలి మేజర్ పంచాయతీలో శనివారం స్వచ్ఛాంధ్రాలో భాగంగా తడిచెత్త - పొడిచెత్తపై పట్టణంలో అధికారులు అవగాహన ర్యాలీ కార్యక్రమంలో ఎంపిడిఒ సిహెచ్.లక్ష్మీబాయి, ఇఒ జి.వెంకటరావు, మట్ట పురుషోత్తం, బెహరా కాళీ, పేరు మురళి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శ్రీకాంత్

'ఉపాధి' బకాయిలు చెల్లించాలి

మెళియాపుట్టి: పెండింగ్‌లో ఉన్న ఉపాధి కూలీల బకాయిల తక్షణమే చెల్లించాలని తూర్పు కాపు మాజీ చైర్మన్ మామిడి శ్రీకాంత్ ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. స్థానిక వైసిపి కార్యాలయంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. పనిప్రదేశంలో కనీసం వసతులు కల్పించాలన్నారు. అలసటగా ఉంటే పొదలు, చెట్ల చాటున సేద తీర్చుకోవాల్సిన పరిస్థితి ఎదురవుతోంది. కనీసం నీటిని సరఫరా చేయడానికి ఒక మేట్‌ను నియమిస్తే కూలీలకు సౌకర్యంగా ఉంటుందన్నారు. టెంట్లు, మెడికల్ కిట్లు ఏర్పాటు చేయాలన్నారు. పనిదినాలకు కనీస కూలి చెల్లించాలన్నారు. ఆయనతోపాటు పాడి అప్పారావు, గణేష్ ప్రధాన్, రంజిత్ ఉన్నారు.

34 మంది ఎంపిక

టెక్కలి: టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం నిర్వహించిన జాబ్‌మేళాలో వివిధ కంపెనీల్లో ఉద్యోగ నిమిత్తం 34 మంది ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ తెంబూరు గోవిందమ్మ తెలిపారు. వివిధ కంపెనీలు నిర్వహించిన ఈ జాబ్‌మేళాలో 74 మంది నిరుద్యోగ అభ్యర్థులు హాజరు కాగా, వీరిలో 34 మంది వివిధ కంపెనీలకు ఎంపికైనట్లు తెలిపారు. కళాశాల జెకెసి కో-ఆర్డినేటర్ ఝాన్సీరాణి ఆధ్వర్యాన నిర్వహించిన ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సతీష్‌కుమార్ అధ్యాపకులు వివిధ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

పాఠశాలకు మైక్‌సెట్ వితరణ

సంతబొమ్మాళి : మండలంలోని బోరుభద్ర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ఆ పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ గన్నవరపు గోవిందరావు తన తల్లిదండ్రులైన గన్నవరపు మల్లేసు, తవిటమ్మల జ్ఞాపకార్థం ఖరీదైన రెండు టెంట్లను శనివారం బహుకరించారు. అలాగే బోరుభద్ర ఉన్నత పాఠశాలలో చదువుకొని ఉన్నత స్థాయిలలో స్థిరపడిన శ్రీకృష్ణాపురానికి చెందిన పూర్వ విద్యార్థులు అత్యాధునిక సౌండ్ సిస్టమ్‌ను బహుకరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం పి.రామకృష్ణ, సహాయ గణాంక అధికారి బాడాన శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు బాడాన ఉదయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



వితరణగా అందజేస్తున్న సామగ్రి

పాఠశాలలు కుదించేందుకు యత్నం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ప్రభుత్వ విద్యారంగాన్ని చక్కదిద్దుతున్నామని ఒకపక్క ప్రకటనలు చేస్తూ ప్రతి శుక్రవారం మీ అభ్యంతరాలను వినేందుకు మా అధికారులు మీకోసం ఎదురుచూస్తున్నారని పైకి తీయన మాటలు చెబుతూనే లోలోపల పాఠశాలలను కుదించేందుకు ప్రణాళికలు రచిస్తున్నారని ఎస్‌టియు జిల్లా అధ్యక్షులు ఎస్‌వి రమణమూర్తి అన్నారు. శనివారం పాఠశాల సమయం ముగిసిన తర్వాత గార మండలం బలరామపురం ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో మొత్తం 3156 ప్రాథమికోన్నత పాఠశాలుండగా వాటిలో 700 ప్రాథమికోన్నత పాఠశాలలను హైస్కూల్‌గా ఉన్నతీకరణ చేసేందుకు అధికారులు నిర్ణయించారని, మరో 1200 యుపి పాఠశాలలను యథావిధిగా ఎస్‌జిటిలతో కొనసాగిస్తామని, మిగిలిన 1256 పాఠశాలలను ప్రైమరీగా డీగ్రేడ్ చేయనున్నామని గురువారం జరిగిన సమావేశంలో వెల్లడించారన్నారు. ఆయా పాఠశాలల్లో యుపి తరగతులు బలవంతంగా తొలగిస్తున్నప్పుడు ఆయా పాఠశాలల్లో విద్యార్థుల పరిస్థితి ఏమిటని, వారంతా సమీప ఉన్నత పాఠశాలల్లోనే చేరుతారని ఎలా చెప్పగలమని, డ్రాపౌట్లను తగ్గించేందుకే యుపి పాఠశాలలను ప్రవేశపెట్టారని, ఇప్పుడు బాలికలు విద్యకు ప్రాధాన్యత లేదా అని ఆయన అధికారులను ప్రశ్నించారు. ఇప్పటికైనా పాఠశాలల మూతవేసే ఆలోచన మానుకోవాలని, ప్రాథమికోన్నత పాఠశాలను కొనసాగించాలని, హైస్కూల్‌తో సంబంధం లేకుండానే మోడల్ ప్రాథమిక పాఠశాలలు ఉండేలా చూడాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సమావేశంలో పాఠశాల హెచ్‌ఎం కె.అశోక్ కుమార్, రామకృష్ణ, నీలమణి, విశ్వనాథం, యామిని, ప్రియదర్శని, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రమణ

ప్రశాంతంగా శాంతి ర్యాలీ

ప్రజాశక్తి- రణస్థలం

స్థానిక రామతీర్థం జంక్షన్ నుంచి రన్ ఫర్ జీసస్ శాంతి ర్యాలీ కార్యక్రమం శనివారం ప్రారంభించారు. ఎపి, తెలంగాణా రెండు రాష్ట్రాల్లో క్రైస్తవ నాయకత్వం, ఆరాధన టీవీ పిలుపు మేరకు చేపట్టిన రన్ ఫర్ జీసస్ శాంతి ర్యాలీని లావేరు, రణస్థలం పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో సీనియర్ పాస్టర్ రెవరెండ్. డా.జాన్ రత్నం, పాస్టర్ సుధాకర్, గౌరవ అధ్యక్షులు పాస్టర్ సి.హెచ్. రూబేన్, ప్రెసిడెంట్ పాస్టర్ ఎం. తిమోతి, వైస్ ప్రెసిడెంట్ పాస్టర్. ఎం.జక్కయ్య, ట్రెజరర్ పాస్టర్ వి.సురేష్, సెక్రటరీ పాస్టర్ ఎం. ఇశ్రాయేలు నిర్వహణలో అనేక మంది క్రైస్తవ సమాజం పాల్గొనగా ఈ శాంతి ర్యాలీ విజయవంతంగా నిర్వహించారు. జెఆర్ పురం సర్పంచ్ బవిరి రమణ ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు.

పొందూరు: పట్టణంలో సిఎంసి చర్చి నిర్వాహకులు సిహెచ్ ప్రభుదాసు, జీవన్ ఆధ్వర్యంలో రన్ ఫర్ జీసెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాలీని నిర్వహించినట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో



రణస్థలం : రన్ ఫర్ జీసస్‌లో పాల్గొన్న పాస్టర్లు, క్రైస్తవ సోదరులు

మండలంలోని పాస్టర్లు ఎలీసా, ఇశ్రాయేలు, సాగర్, కిషోర్‌తో పాటు పలువురు క్రైస్తవ సోదరులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం: నగరంలోని ఏడురోడ్ల జంక్షన్ నుంచి 'రన్ ఫర్ జీసస్ పేరుతో పాస్టర్స్ ఫెలో షిప్ ఆధ్వర్యాన ర్యాలీ నిర్వహించారు. డేఅండ్‌నైట్ జంక్షన్, రైతు బజారు, చిన్న బజార్ మీదుగా చర్చి వరకు సాగింది. జిల్లా క్రైస్తవ సంక్షేమ సంఘం, సీనియర్ మెన్ క్రిస్టియన్ అసోసియేషన్, క్రిస్టియన్ బరియల్ గ్రౌండ్ కమిటీల ఆధ్వర్యాన జరిగిన ఈ ప్రదర్శనలో విశ్వాసరావు, శామ్యూల్ మోజెస్, సుజ్ఞానరావు తదితరులు పాల్గొన్నారు.



నవధాన్యాల విత్తనాలను పరిశీలిస్తున్న సత్యనారాయణ

నవధాన్యాలు సాగుచేద్దాం

ప్రజాశక్తి- ఆమదాలవలస

నవధాన్యాలు సాగు చేసి నేల తల్లిని కాపాడుకుందామని ప్రకృతి వ్యవసాయ డిపిఎం పూజారి సత్యనారాయణ అన్నారు. మండలంలోని చేపేనపేట యూనిట్ పరిధిలో ప్రకృతి వ్యవసాయ విభాగంలో భాగంగా ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ పూజారి సత్యనారాయణ ఆధ్వర్యాన మండలంలోని ప్రకృతి వ్యవసాయ సిబ్బంది క్షేత్రస్థాయిలో నవధాన్యాల సాగుకు 25 కేజీలు 30 రకాల విత్తనాలతో నవధాన్యాల కిట్లను శనివారం తయారు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ సిబ్బందితో నవధాన్యాల సాగును క్షేత్రస్థాయిలో రైతులు అందరితో వేసే విధంగా విత్తన సేకరణ, కిట్లు తయారీ చేశామన్నారు. ప్రకృతి వ్యవసాయంలో ఈ నవధాన్యాల సాగు పాత్ర చాలా కీలకమన్నారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఎన్.ఎఫ్.శ్రీనివాస్, మాస్టర్ ట్రైనర్ లక్షుంనాయుడు పాల్గొన్నారు.

రేపు ధర్నా

ప్రజాశక్తి- ఆమదాలవలస

ఈ నెల 21న తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్నామని, దీనిని విజయవంతం చేయాలని అల్ పెన్షనన్లు, పన్షనర్ల అసోసియేషన్ పూర్వ ప్రధాన కార్యదర్శి బొడ్డేపల్లి జనార్ధనరావు ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ధర్నా నిర్వహిస్తామని తెలిపారు. పెన్షనర్ల డిమాండ్ల పరిష్కారానికి ప్రభుత్వానికి తెలియజేయడానికి ఈ ధర్నా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో విశ్రాంత పెన్షనర్లు, ఫ్యామిలీ పెన్షనర్లు పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

సేంద్రీయ వ్యవసాయానికి ప్రాధాన్యం

కొత్తూరు: రైతులు సేంద్రీయ వ్యవసాయానికి ప్రాధాన్యత ఇవ్వాలని మండల పరిషత్ ఉపాధ్యక్షులు లోతుగడ్డ తులసీవరప్రసాదరావు అన్నారు. స్థానిక రామాలయంలో సేంద్రీయ వ్యవసాయంపై రైతులకు అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రసాయనిక వ్యవసాయం శృతిమించి చేయడం పంటలు దిగుబడి పెరుగుతుందని, కానీ, భూమి విషితుల్యమై అది మానవజాతి మనుగడకే ప్రమాదంగా మారుతుందని అన్నారు. ఈ విషయాన్ని రైతులు గ్రహించి సేంద్రీయ వ్యవసాయం వైపు అడుగులు వేయాలన్నారు. కార్యక్రమంలో లోతుగెడ్డ తాతబాబు, పొగిరి అర్జున్, బోర శ్రీరాములు, పడాల వెంకటకృష్ణ జి.మన్మథరావు పాల్గొన్నారు.

గర్భిణులకు సీమంతాలు

మందస : మందస ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో పోషణ పక్వాడా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. అనంతరం గర్భిణులకు, బాలింతలకు పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. కార్యక్రమంలో సిడిపిఒ కె.వసుంధరాదేవి, సూపర్‌వజర్లు బి.మంగమ్మ, రామలక్ష్మి, జయలక్ష్మి, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.